# తండ్రి గారి సందేశం....



## ఎఫాతా ధ్యానకేంద్రం - దేవుడు మన మేత్రాసనంలో చేసిన గొప్ప అద్భుతం

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

**"ప్రభువు తన ప్రజలతో ఇట్లనెను. మీరు మీ చుట్టుపట్లగల జాతులకు పరిశీలించి చూడుడు. మీరు చూచిన దానివలన మీకాశ్చర్యము కలుగును. నేనిపుడొక కార్యమును చేయబోవుచున్నాను. దానిని గూర్చి వినినపుడు మీరు నమ్మజాలరు" (హబక్కూకు 1,5).**

యావే దేవుడు దర్శనములో హబక్కూకు ప్రవక్తకు తెలియచేసినట్లు అందరికి ఆశ్చర్యము కలిగించే ఒక గొప్ప కార్యము ప్రభువు మన మేత్రాసనంలో ఈ నెల ఆరవ తేదీన చేశారు. ఊహలకందని దీవెనలతో మనల్ని దీవించిన ప్రభువు, ఎఫాతా ధ్యానకేంద్రాన్ని తయారుచేసి మన చేతికి అప్పగించారు. నాతో పాటు మీరందరు ఎన్నాళ్లుగా ఎదురుచూచిన రోజు ఇది. ఈ రోజు కోసం ఎన్నెన్నో కలలు మనం కన్నాము. వాస్తవానికి ఇక్కడ నెరవేరినది మన కలలు మాత్రం కాదు. మనం ఈ ధ్యానకేంద్రము గూర్చి ఊహించే ముందు, కలలు కనని ముందు ప్రభువు దీనిని మనసులో రూపొందించారని నేను నమ్ముచున్నాను. ఈ ధ్యానకేంద్ర నిర్మాణము ఆయన ముందుండి నడిపించారు. ఇది ప్రభువు మన మధ్యలో చేసిన గొప్ప అద్భుతం.

యేసు ప్రభు తన బహిరంగ జీవితాన్ని ప్రారంభించినప్పుడు ఈ విధముగా పలికారు, "ప్రభువు ఆత్మ నాపై ఉన్నది. పేదలకు సువార్తను బోధించుటకై ఆయన నన్ను అభిషేకించెను" (లూకా 4,18). యేసు ప్రభువుపై దిగివచ్చిన ఆత్మ మన మేత్రాసనంపై ప్రత్యేకంగా ఎఫాతా ధ్యానకేంద్రంపై దిగివచ్చి ఉంది. ప్రభువు ఆత్మశక్తి వలన ఈ ప్రాంతంలో మనం సువార్తను ప్రకటించాలి. సువార్తను ప్రకటించడం పీఠాధిపతులకు, గురువులకు, మఠకన్యలకు మాత్రం అప్పగించబడిన బాధ్యత అని మనం అనుకోకూడదు. సువార్తను ప్రకటించే అధికారం లేదా బాధ్యత ఒక్కరికి లభించేది అంకిత జీవితం ద్వారా కాదు, జ్ఞానస్నానం ద్వారానే. కాబట్టి సువార్త వినిన వారందరు, జ్ఞానస్నానం పొంది జీవపు గుర్తుచే ముద్రింపబడిన వారందరు సువార్తీకులే. ఎఫాతా ధ్యానకేంద్రం ప్రారంభముతో మన గురుపీఠ చరిత్ర మరో ముఖ్యమైన మలుపు తిరుగుతుంది. ఈ ప్రాంగణంలో సువార్తను ప్రకటించడానికి మనమందరం కంకణం కట్టుకొని పూనుకోవాలి. మనమందరం కలిసి ఇక్కడ ఉన్న ప్రజలందరికి సువార్తను ప్రకటించాలి.

అపోస్తలుల కార్యములో చాలా చోట్ల మొట్టమొదటిగా సువార్త ప్రచారం చేసినది అపోస్తలులు కాదు, కాని సాధారణ క్రైస్తవులని అపోస్తలుల కార్యములు 8,1-5 వరకు చదివితే మనం గ్రహించవచ్చు. అపోస్తలుల కార్యము 8,1వ వాక్యంలో యెరూషలేములోని సంఘము క్రూరమైన హింసలకు గురిఅవ్వడంతో సమరియ ప్రాంతపు నలుమూలలకు చెల్లచెదరై పోయినట్లు రాసియుంది.

వాస్తవానికి ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకొని వారు వెళ్ళిపోయారు. కాని వారు చేరుకున్న చోట వారు దాగి ఉండలేదు, నోరు మూసుకొని బ్రతుకలేదు. వారు వెళ్ళిన చోటెల్ల సువార్తను ప్రకటించారు. అపోస్తలుల కార్యములు 8,4వ వాక్యంలో "చెల్లచెదరై పోయిన వారు సువార్తను ఎల్లెడల బోధించుచుండిరి" అని మనం చదువవచ్చు. ప్రియమైన అదిలాబాద్ గురుపీఠ దైవ ప్రజలారా, మీరు కూడా సువార్తీకులే. మనమందరం కలిసి ఈ ప్రాంతంలో దేవుని రాజ్యమును స్థాపించాలి.

లూకా సువార్త 2,10వ వచనంలో దేవదూత గొఱ్ఱెల కాపరులతో చెప్పిన సంగతి మనం చదువుతున్నాము "మీరు భయపడవలదు. సమస్త ప్రజలకు వరమానందము కలిగించు శుభ సమాచారమును మీకు వినిపించెదను". మానవులందరికి సంతోషము కలిగించు శుభ సమాచారము దావీదు నగరంలో యేసు ప్రభుని పుట్టుక అని సువార్త మనల్ని బోధిస్తుంది. రక్షకుని పుట్టుక మనకు ఎంతో ఆనందాన్ని కలుగజేస్తుంది. కానీ, ఈ శుభ సమచారమును ఇప్పటి వరకు వినని వారు చాలా మంది ఉన్నారు. వారందరికి సువార్త అందించడం మన బాధ్యత. పునీత పౌలు గారు రోమీయులకు వ్రాసిన లేఖ 10,14-17 వాక్యలలో సెలవిస్తున్నారు. "మీరు ప్రసంగించకపోతే వారెట్ల ఆలకిస్తారు. ఆలకించకపోతే, వాళ్ళు ఎలా విశ్వసిస్తారు? విశ్వాసం వినుటవలన కలుగుతుంది. వినుట క్రీస్తును గూర్చిన ప్రసంగం వలన కలుగుతుంది". కాబట్టి మన ప్రాంతంలో ఇంకా యేసుక్రీస్తు పుట్టిన సంగతి కూడా తెలియని వాళ్ళు చాలా మంది ఉన్నారంటే, దేవుని వాక్యం వినని వాళ్ళు చాలా మంది ఉన్నారంటే అది మన అందరి బాధ్యతగా మనం భావించాలి.

కాబట్టి, ఒక మేత్రాసనంగా మనమందరం కలిసి కట్టుగా సువార్త ప్రచారం కోసం కృషి చేయాలి. అందుకోసమే దేవుడు ఈ ఎఫాతా ధ్యానకేంద్రమనే గొప్ప బహుమానాన్ని మనకు అందించారు. దేవుడు తన ప్రణాళికతో ఏర్పాటు చేసిన ఈ ధ్యానకేంద్రాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి. ప్రియమైన సహోదరీ సహోదరులారా, మీరందరూ ఈ ధ్యానకేంద్రానికి తరలివచ్చి దేవుని వాక్యమును చదివి, ఆలకించి, పఠించి, ధ్యానించి, సువార్తీకులుగా మారాలి. మన ప్రాంతములో సువార్త ప్రచారాన్ని బలోపేతం చేయడానికి దేవుడు ఈ ధ్యానకేంద్రాన్ని వాడుకోవాలని మనమందరం కలిసి ప్రార్థిద్దాం. అదేవిధంగా మనవంతు మనం కూడా కృషి చేద్దాం.

"ఎవరును ఎప్పుడును దేవుని చూడలేదు" (యోహాను 1,18). ఈ వాక్యమును గమనించినట్లయితే, యేసు ప్రభువు పుట్టుక మానవులందరిని బాధించిన సమస్య యొక్క పరిష్కారమని మనం అర్థం చేసుకోవచ్చు. ఎరుగని దేవునిలో విశ్వసించడం, కనపడని దేవునితో ప్రార్థించడం చాలా బాధకరంగా ఉన్న రోజులలో తండ్రి దేవుని వక్షఃస్థలమున ఉన్న జనితైక కుమారుడు ఈ లోకములో అవతరించి ఆ సమస్యను పరిష్కరించారు. క్రీస్తు అదృశ్యుడై ఉన్న దేవుని ప్రత్యక్ష రూపమని పునీత పౌలు గారు బోధిస్తున్నారు (కొలొస్సీ 1,15). యోహాను సువార్తలో "నన్ను చూచిన వాడు నా తండ్రిని చూచియున్నాడు" అని యేసు ప్రభు అంటున్నారు (యోహాను 14,9). దేవుడు అదృశ్యుడే కానీ, ఆ దేవునికి ఒక ప్రత్యక్ష రూపమున్నది. ఆ రూపమే యేసు ప్రభువు. తన మాటల ద్వారా, చేతల ద్వారా ఆ అదృశ్యుడైన దేవుని ఈ లోకానికి యేసు ప్రభువు చూపించారు. సాక్షాత్కార కాలములో ఉండి

ఈ విషయాన్ని మనం ధ్యానించుకుంటున్నాము. తండ్రి దేవున్ని క్రీస్తు ప్రభువులో మనం చూడవచ్చు. ఆ క్రీస్తు ప్రభువు లోకాంత్యము వరకు సర్వదా మనతో ఉంటాడని వాగ్దానం ఇచ్చియున్నారు (మత్తయి 28,20). మన మధ్య ఉన్న యేసు ప్రభుని మనం ప్రకటించాలి. యేసు ప్రభువు తన జీవితము ద్వారా తండ్రిని తెలియపరచినట్లు ఈ ప్రాంతములో ఉన్న వారికి దేవుని తెలియపరచే వారలుగా మనం మారాలి. యేసు ప్రభువు మన జీవితాన్ని వెలిగించినట్లు ఇతరుల జీవితాలను సువార్తతో మనం వెలిగించాలి. "ప్రజలు మీ సత్కార్యములను చూచి పరలోకమందున్న మీ తండ్రిని సన్నుతించుటకు మీ వెలుగును వారియెదుట ప్రకాశింపనిందు" (మత్తయి 5,16) అను వాక్యము మనల్ని నడిపించును గాక!

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

**"ప్రభువు మంచివాడు. అతడు తన ప్రజలను ఆపదల నుండి కాపాడును. తనను నమ్మువారిని ఆదుకొనును"**

(నహూము 1,7)



